# కాటన్ సంచులను వాడుదాం..పాలిథిన్‌ను నివారిద్దాం

## ప్రకృతిని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి ఇంజనీర్స్ డే సందర్భంగా ఏడీఈ పాల్వాయి రణధీర్ రెడ్డి

తెలుగు గళం న్యూస్ స్టేషన్ ఘనపూర్ సెప్టెంబర్ 15

ప్లాస్టిక్, పాలిథిన్ కవర్ల వినియోగాన్ని పూర్తిగా తగ్గించి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎన్పీడీసీఎల్ ఘనపూర్ ఆపరేషన్ ఏడీఈ పాల్వాయి రణధీర్ రెడ్డి పిలుపునిచ్చారు.ప్రకృతికి అనుకూలమైన కాటన్ సంచులను వినియోగించడం ద్వారా కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని ఆయన అన్నారు.మంగళవారం స్టేషన్ ఘనపూర్ మున్సిపల్ పట్టణ కేంద్రంలోని ట్రాన్స్‌కో 132/33 కేవీ విద్యుత్ ఉపకేంద్రంలో ఇంజనీర్స్ డే సందర్భంగా లయన్స్ క్లబ్ సేవా సమితి ఆధ్వర్యంలో విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఇంజనీర్లను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా మధు ఎలక్ట్రికల్స్ వారు అందించిన కాటన్ సంచులను ఇంజనీర్లకు అందజేశారు.ఈ సందర్భంగా సన్మాన గ్రహీత రణధీర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా సేవా కార్యక్రమాలతో ప్రత్యేక గుర్తింపు పొందిన లయన్స్ క్లబ్ సభ్యుల సేవలు అభినందనీయమన్నారు.ప్రతి కార్యక్రమంలో సామాజిక ప్రయోజనాన్ని మిళితం చేయడం వారి ప్రత్యేకతగా పేర్కొన్నారు. ఇంజనీర్స్ డే సందర్భంగా కాటన్ సంచులను అందించి ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలనే సందేశాన్ని ఇవ్వడం మంచి ఆలోచన అన్నారు.మనకు తెలియకుండానే రోజువారీ అలవాట్లలో భాగంగా ఉపయోగిస్తున్న కొన్ని వస్తువులు పర్యావరణానికి, ప్రజారోగ్యానికి తీవ్ర నష్టం కలిగిస్తున్నాయని రణధీర్ రెడ్డి అన్నారు. ముఖ్యంగా పాలిథిన్, ప్లాస్టిక్ వస్తువుల వినియోగం వల్ల పర్యావరణ కాలుష్యం పెరుగుతోందని తెలిపారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, పునర్వినియోగపరచగల కాటన్ సంచులు వంటి పర్యావరణహిత వస్తువులను వినియోగించాలని సూచించారు.ప్లాస్టిక్ ఆధారిత వస్తువుల వినియోగాన్ని నియంత్రించి కాలుష్యరహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని ఆయన



కోరారు. ప్రకృతి అనుకూల వస్తువులను వినియోగించడం ద్వారా భవిష్యత్ తరాలను పర్యావరణ సమస్యల నుంచి కాపాడాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో సబ్‌ఇంజనీర్ ఎం. రమేష్, ఎన్పీడీసీఎల్ ఘనపూర్ ఏఈ పి. శంకర్, సబ్‌ఇంజనీర్లు పి. సాధన, బి. హరిత, లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు ఆమంచ నిర్మల, కోశాధికారి పసునూరి నాగేశ్వర్, ఆమంచ మధుసూదన్, వి.టి. శ్రీనివాస్, గంగరాజు, శేఖర్, లైన్‌మెన్లు వాసం శ్రీధర్, అన్వర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# మంగపేట యువ నాయకుడికి రాష్ట్రస్థాయి బాధ్యతలు

## కర్రి నాగేంద్రబాబుకు తెలంగాణ కాంగ్రెస్ సోషల్ మీడియా సెక్రటరీగా కీలక పదవి

## కాంగ్రెస్ బలోపేతానికి సోషల్ మీడియానే ఆయుధంగా ముందుకు సాగుతాం -- కర్రి నాగేంద్రబాబు

తెలుగు గళం మంగపేట, ములుగు సెప్టెంబర్ 15:



ములుగు జిల్లా మంగపేట మండలం రాజుపేట గ్రామానికి చెందిన యువ నాయకుడు, ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ కర్రి నాగేంద్రబాబుకు తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలో కీలక బాధ్యతలు దక్కాయి. ఆయనను తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ సోషల్ మీడియా సెక్రటరీగా నియమిస్తూ రాష్ట్ర కాంగ్రెస్ సోషల్ మీడియా చైర్మన్ పట్టెం నవీన్ అధికారికంగా ఉత్తర్వులు జారీ చేశారు. గ్రామస్థాయి నుంచి రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన కర్రి నాగేంద్రబాబు ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో చురుకైన పాత్ర పోషించారు. కాంగ్రెస్ పార్టీ విధానాలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు, ప్రజా సమస్యలు, పార్టీ నాయకుల కార్యక్రమాలను సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృతంగా ప్రచారం చేస్తూ పార్టీకి డిజిటల్ వేదికపై బలమైన ప్రచార వ్యవస్థను నిర్మించడంలో కృషి చేశారు. ఈ క్రమంలో ఆయన పనితీరును గుర్తించిన రాష్ట్ర కాంగ్రెస్ నాయకత్వం రాష్ట్రస్థాయిలో కీలక బాధ్యతలను అప్పగించింది. దీంతో మంగపేట మండలం నుంచి రాష్ట్ర కాంగ్రెస్ సోషల్ మీడియా విభాగంలో కీలక పదవి దక్కించుకున్న యువ నాయకుడిగా కర్రి నాగేంద్రబాబుకు గుర్తింపు లభించింది. ఈ సందర్భంగా కర్రి నాగేంద్రబాబు మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి రాష్ట్ర కాంగ్రెస్ సోషల్ మీడియా సెక్రటరీగా నియమించిన తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, స్త్రీ--శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, ములుగు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పైడాకుల అశోక్, రాష్ట్ర కాంగ్రెస్ సోషల్ మీడియా చైర్మన్ పట్టెం నవీన్లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన రాష్ట్రస్థాయి బాధ్యతలను నిబద్ధతతో నిర్వహిస్తానని, కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వ ప్రజా సంక్షేమ కార్యక్రమాలను సోషల్ మీడియా ద్వారా ప్రతి ఇంటికీ చేరేలా కృషి చేస్తానని తెలిపారు. ముఖ్యంగా యువతను కాంగ్రెస్ పార్టీ వైపు మరింతగా ఆకర్షించేలా డిజిటల్ వేదికలను సమర్థవంతంగా వినియోగిస్తామని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజా సంక్షేమ పాలనను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, ప్రతిపక్షాల అసత్య ప్రచారాన్ని వాస్తవాలతో తిప్పికొట్టేందుకు సోషల్ మీడియా వేదికగా బలమైన ప్రచారాన్ని నిర్వహిస్తామని నాగేంద్రబాబు స్పష్టం చేశారు. రాష్ట్రస్థాయి బాధ్యతలు దక్కించుకున్న కర్రి నాగేంద్రబాబుకు మంగపేట మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువజన నాయకులు, సోషల్ మీడియా కార్యకర్తలు అభినందనలు తెలిపారు. ములుగు జిల్లా నుంచి రాష్ట్రస్థాయిలో మరింత మంది యువ నాయకులు ఎదగడానికి ఈ నియామకం ప్రోత్సాహకరమని కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి.

# మంగపేట--ఏటూరునాగారం ప్రధాన రహదారి గుంతలమయం -- వెంటనే మరమ్మతులు చేపట్టాలి

## ఏజెన్సీ సంపద దోచుకోవడంలో ఉన్న శ్రద్ధ.. రోడ్ల అభివృద్ధిపై ఎందుకు లేదు?

## గర్భిణీలు, అత్యవసర రోగుల ప్రాణాలకు ముప్పు కలిగిస్తున్న గుంతల రహదారి

## ప్రభుత్వం, అధికారులు వెంటనే స్పందించాలి: ఆదివాసీ ప్రజాసంఘాల జేఏసీ డిమాండ్





తెలుగు గళం మంగపేట సెప్టెంబర్ 15:

ములుగు జిల్లా షెడ్యూల్డ్ ఏజెన్సీ ప్రాంతమైన మంగపేట మండలం నుంచి ఏటూరునాగారం వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా గుంతలమయంగా మారినా ప్రభుత్వం, సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని మంగపేట మండల ఆదివాసీ ప్రజాసంఘాల జేఏసీ అధ్యక్షుడు పొలేపొయిన ఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి తాటి నాగరాజు ఆవేదన వ్యక్తం చేశారు. ఏజెన్సీ ప్రాంతంలోని వనరులు, ఖనిజ సంపదను వినియోగించుకోవడంపై చూపుతున్న శ్రద్ధ, ఈ ప్రాంత అభివృద్ధిపై కూడా చూపాలని వారు డిమాండ్ చేశారు. రహదారి అధ్వానంగా మారడంతో మంగపేట--ఏటూరునాగారం మండలాల మధ్య ప్రయాణించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా గర్భిణీలు, అత్యవసర వైద్యం అవసరమైన రోగులను ఆసుపత్రులకు తరలించే సమయంలో రహదారి పరిస్థితి తీవ్ర సమస్యగా మారుతోందని, అత్యవసర పరిస్థితుల్లో మార్గమధ్యలోనే ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి మంగపేట--ఏటూరునాగారం ప్రధాన రహదారికి నాణ్యమైన మరమ్మతులు చేపట్టి ప్రజలకు సురక్షిత రాకపోకలు కల్పించాలని ఆదివాసీ ప్రజాసంఘాల జేఏసీ నాయకులు పొలేపొయిన ఆదినారాయణ, తాటి నాగరాజు డిమాండ్ చేశారు.

# ఆసుపత్రుల్లో ఆకస్మిక తనిఖీలు.. వైద్య సేవల్లో నిర్లక్ష్యానికి తావులేదు

## : ఐటీడీఏ పీవో లెనిన్ వత్సల్ టోప్పో

## సీజనల్ వ్యాధుల నియంత్రణకు పకడ్బందీ చర్యలు చేపట్టాలి

## ఆసుపత్రుల్లో వైద్యులు అందుబాటులో ఉండాలి.. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

తెలుగు గళం ఏటూరునాగారం, సెప్టెంబర్ 15:

ఏజెన్సీ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా వైద్య సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ సూచించారు. మంగళవారం తాడ్వాయి, గోవిందరావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న రోగులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యత, వైద్య సదుపాయాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం తాడ్వాయి వైద్యాధికారి డాక్టర్ ఈ.ప్రశాంత్ (ఎంఒ), గోవిందరావుపేట వైద్యాధికారి లిడాక్టర్ అనూష (ఎంఒ)లితో మాట్లాడి ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలు, మందుల నిల్వలు, రోగులకు అందిస్తున్న చికిత్స తదితర అంశాలపై సమీక్షించారు. ఆసుపత్రుల్లో వైద్యులు, వైద్య సిబ్బంది తప్పనిసరిగా అందుబాటులో ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో రోగులకు వెంటనే వైద్య సేవలు అందించాలని సూచించారు.





రోగులకు అవసరమైన మందులు, చికిత్స సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆసుపత్రిలోని మందుల స్టాక్ వివరాలు, రిజిస్టర్లను పరిశీలించి రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ప్రస్తుతం వర్షాకాలం నేపథ్యంలో మలేరియా, డెంగ్యూ తదితర సీజనల్ వ్యాధుల పట్ల ప్రత్యేక అప్రమత్తత అవసరమని తెలిపారు. వ్యాధులు వచ్చిన తర్వాత చికిత్స అందించడం కంటే ముందుగానే నివారణ చర్యలు చేపట్టడం ముఖ్యమని పేర్కొన్నారు. గ్రామపంచాయతీ సిబ్బంది సహకారంతో గ్రామాల్లో దోమల మందు పిచికారీ చేయాలని, అవసరమైన ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని సూచించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, మురుగునీరు నిల్వ ఉండకుండా, దోమల వృద్ధికి అవకాశం లేకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఏజెన్సీ ప్రాంత ప్రజల ఆరోగ్య పరిరక్షణకు వైద్య శాఖ, గ్రామపంచాయతీ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ సూచించారు. సీజనల్ వ్యాధుల నియంత్రణలో నిర్లక్ష్యం లేకుండా అవసరమైన అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

# సెప్టెంబర్ 17ను అధికారికంగా నిర్వహించాలి

## :బీజేపీ జిల్లా అధ్యక్షుడు నిషీధర్ రెడ్డి



తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి

సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని బీజేపీ జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిషీధర్ రెడ్డి డిమాండ్ చేశారు.ఈ మేరకు మంగళవారం కలెక్టరేట్‌లో డీఆర్వో వసంతకుమారికి బీజేపీ నాయకులతో కలిసి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిజాం నిరంకుశ పాలనపై ప్రజలు,యోధులు సాగించిన వీరోచిత పోరాట ఫలితంగానే సెప్టెంబర్ 17న తెలంగాణకు విముక్తి లభించిందని గుర్తుచేశారు.ఈ చారిత్రక దినాన్ని రాజకీయాలకు అతీతంగా గుర్తించి,జిల్లా, నియోజకవర్గ,మండల కేంద్రాల్లో ప్రభుత్వమే అధికారికంగా వేడుకలు జరపాలని కోరారు.పోరాట వీరుల త్యాగాలను,చరిత్రను భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని,ఎలాంటి జాప్యం చేయకుండా వెంటనే దీనిపై స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా,మండల స్థాయి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



# సింగరేణి లో ఘనంగా ఇంజనీర్స్ డే వేడుకలు"





సత్తుపల్లి,ఆర్ సి,సెప్టెంబర్15( తెలుగు గళం) న్యూస్:సత్తుపల్లి సింగరేణి ఏరియాలో ఇంజనీర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్) కొప్పుల వెంకటేశ్వర్లు, సత్తుపల్లి ఏరియా జనరల్ మేనేజర్ సిరికొండ వెంకటాచారి, జేవీఆర్ ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎన్‌వీఆర్ ప్రహ్లాద్ జేవీఆర్ ఓసీని సందర్శించారు. అనంతరం జీఎం కార్యాలయంలో జరిగిన ఇంజనీర్స్ డే కార్యక్రమంలో మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్‌టూ జీఎం బొల్లం శ్రీనివాస్, కిష్టారం ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్, సునీల్ వర్మ, ఏరియా ఇంజనీర్ కె. సోమశేఖరరావు, పి. సాయినాథ్, ఎం. మోహన్, బి. రామకృష్ణ, ఎల్. తిరుపతి, ఎం. మురళి, కె. శ్రీనివాస్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# గడువులోగా భూ రీ-సర్వే పూర్తి చేయాలి

## :అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్

తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి మొగుళ్లపల్లి



మండలంలోని అకినేపల్లి గ్రామంలో కొనసాగుతున్న భూ రీ-సర్వే ప్రక్రియను వేగవంతం చేసి,నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్ అధికారులను ఆదేశించారు.మంగళవారం ఆయన గ్రామంలోని రీ-సర్వే పనులను ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూ యజమానులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సర్వేను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలన్నారు.సరిహద్దు వివాదాలు ఉన్న చోట రైతుల సమక్షంలోనే పరిశీలించి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ రికార్డుల నమోదులో పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సర్వే బృందాలు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సర్వే,రెవెన్యూ సిబ్బంది,రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలి:ఎమ్మెల్యే గండ్ర



తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రభుత్వానికి అత్యంత ప్రతిష్టాత్మకమైనదని,జిల్లాలో ఇళ్ల గ్రౌండింగ్,నిర్మాణ పనులను వేగవంతం చేసి నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేయాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అధికారులను ఆదేశించారు.మంగళవారం ఐడీఓసీలో కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి గృహ నిర్మాణ శాఖ,ఎంపీడీఓలు,మున్సిపల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మంజూరైన ఇళ్లను త్వరితగతిన గ్రౌండింగ్ చేసి గృహ నిర్మాణంలో జిల్లాను ఆదర్శంగా నిలపాలన్నారు.రెండో విడత లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియలో పేదరికమే ప్రామాణికంగా క్షేత్రస్థాయి విచారణ చేపట్టాలని,ఎలాంటి వివక్షకు తావులేకుండా అర్హులను గుర్తించాలని స్పష్టం చేశారు.అలాగే డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కాలనీల్లో తాగునీరు,విద్యుత్,డ్రైనేజీ,రహదారుల టెండర్ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ.. నిర్మాణ పనులకు సంబంధించి ఎంబీ రికార్డులను ఎప్పటికప్పుడు నమోదు చేసి,లబ్ధిదారులకు బిల్లుల చెల్లింపులో ఎలాంటి ఆలస్యం జరగకుండా చూడాలన్నారు.కాటారం డివిజన్‌లో నిర్మాణ పనుల పురోగతి మందకొడిగా ఉందని,అక్కడ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి,హౌసింగ్ పీడీ శ్రీకాంత్,మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్,ఎంపీడీఓలు,హౌసింగ్ ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

Printed and Published by Rayaparthi Bhanuprasad on be half Of Telugu galam
H.No: 1-6, Thammadapally-G, Guduru, PO: Thammadapalli 506316 , Jangoan , Telangana State,
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.